

# రచయితల కిదాకనాళం

పోట్లూరి సుబ్రహ్మణ్యం

**అతని** పేరు సప్తగిరి. సొంత వూరు వెంకటగిరి. అయితే ప్రస్తుతం ఉద్యోగరీత్యా భువనగిరిలో ఉంటున్నాడు.


సప్తగిరి "డబ్బు సంపాదించడ మెలా? " అన్న మూడొందల పేజీల పుస్తకం వ్రాసి, అంతటితో ఆగక దాన్ని అచ్చు కొట్టించి దాదాపు పది వేల రూపాయల వరకు అప్పుల పాలయ్యాడు. అందువల్లనే అతడు ఇక్కడకు ట్రాన్స్ఫరు పెట్టించుకున్నాడని చెప్పుకుంటారు.

ఆ రోజు ఆదివారం. సప్తగిరి గదిలో కూర్చుని తీవ్రంగా లెక్కలు వేస్తున్నాడు. పుస్తకానికి పెట్టిన ఖర్చు, అమ్ముడయిన పుస్తకాలు, ఇంకా తను ఎవరెవరికి బాకీ ఉన్నాడో పర్టిక్యులర్స్ తయారు చేస్తున్నాడు. అతను మూడు లిస్టులు ప్రిపేరు చేశాడు. మొదటిది ఉత్తమ, రెండవది మధ్యమ, మూడవది అధమ. అంటే అవి వరసగా అప్పు పూర్తిగా ఎగగొట్టినా ఫరవాలేదనుకున్న వారి లిస్టు, కొంతవరకు చెల్లించి కొంత ఎగగొట్ట వలసిన లిస్టు, పూర్తిగా చెల్లించవలసిన లిస్టు.

ఇంతలో బయట సంపు దగ్గర కూజాకి నీళ్ళు పడుతున్న పన్నెండేళ్ళ పిల్ల తలుపు తట్టి "అయ్యగారూ, మీ కోసం ఎవరో వచ్చారు" అంది.

తనను మధ్యలో డిస్టర్బు చేసినందుకు విసుగు నటిస్తూ, వోరగా ఉన్న తలుపులు బార్లాగా తెరిచి "లోపలికి రమ్మను" అన్నాడు. తడి బట్టలతో ఉన్న పని పిల్లను చూస్తూ 'ఇక నాలుగేళ్ళకు ఇది ఎన్ని ఒంపు సొంపులతో తయారవుతుందో' అనుకున్నాడు.

భుజాన ఒక పెద్ద కట్ట పుస్తకాలతో లోపలికి ప్రవేశించాడు అతని కొలీగ్ గోవిందరావు. ఆ పొజిషన్లో గోవిందరావుని చూసిన సప్తగిరి




మూర్ఛపోయి తమాయించుకున్నాడు.

"గురూ! బాధ పడకు. ఏం చేస్తాం? ముందేమో పుస్తకాలు పంచేస్తివి. ఇప్పుడు డబ్బు అడగబోయే సరికి పుస్తకాలు తిరిగి ఇచ్చేశారు. కొందరేమో పుస్తకం కనిపించడం లేదంటున్నారు."

"డబ్బు సంపాదించడ మెలా?" అనే పుస్తకం రాసి డబ్బు సంపాదించాలనుకున్న సప్తగిరి తన ప్రయోగం తనకే బెడిసి కొట్టినందుకు ఎంతో బాధ పడి పోతున్నాడు.

ఇంతలో టైము చూసిన సప్తగిరి హడావుడిగా "సరే, గోవిందరావ్. ఒక్క నిమిషం నువ్వు బయట కూర్చో. వరండాలో కుర్చీ ఉంది" అన్నాడు.

"ఇక్కడ కూర్చుంటే ఏం, గురో!"

"నువ్వు కూర్చో అమ్మా. మా బాబువి కదూ. రెండు నిమిషాలే" అంటూ గోవిందరావుని రెక్క పట్టి బయటికి నెట్టి తలుపులు మూసి లోపల గడియ పెట్టుకున్నాడు.

"నీలవేణీ, నీలవేణీ" అంటూ చిన్నగా పిలిచాడు.

బిందె చంకన పెట్టి పూల తీగలా నడిచిపోతున్న నీలవేణి కిటికీ దగ్గరకు వచ్చి ఆగిపోయింది.

"దేవిగారి దర్శనం ఉదయం నుంచి కాలేదు."

"మా నాన్న ఇప్పటివరకు ఇంట్లోనే ఉన్నాడు. మీ కేమో కిటికీ దగ్గర నిలబడి గంటల కొద్దీ కబుర్లు చెప్పాలాయె. అందుకే ఆయనలా వెళ్ళ నిచ్చి వచ్చారు." నవ్వుతూ అంది నీలవేణి.

"కిటికీ దగ్గర నిలబడి కబుర్లు చెప్పకపోతే గదిలోకి రాకూడ దేమిటి?"

"అమ్మో. గదిలోకే. అందులోనూ మిమ్మల్ని నమ్మి రావడం."

"ఏం? నేను సింహాన్నా నిన్ను నమిలి మింగేస్తా ననుకోడానికి?"

"మరికాక. నువ్వు మగ పురుగువయితే, మేము ఆడపురుగులం. మీకూ మాకూ తరతరాల నుంచి యుద్ధమే కదా. మోసం చేయడం మీ వంతు. మోసపోవడం మా వంతు."

"అబ్బో, మాటలు చాలా నేర్చావే."

"అంతా రచయితగారి పుణ్యం."

రచయిత అని సంబోధించేసరికి సప్తగిరి ఉబ్బి పోయాడు.

"అయితే 'డబ్బు సంపాదించడ మెలా?' పుస్తకం ఇంకో కాపీ ఇచ్చేదా" అన్నాడు ఆనందంగా.

"ఎందుకు? ఒకటిచ్చావుగా 'విత్ లవ్' అని వ్రాసి."

"ఇంతకీ నీ అభిప్రాయ మేమిటి, నీలవేణీ. ఫస్ట్ రీడింగ్ కదూ?"

"నిజం చెబుతున్నాను—బాధ పడకు. దాని పేరు 'మోసంతో డబ్బు సంపాదించడ మెలా?' అని ఉండాలి."

"అంటే?"

"అపార్థం చేసుకోకు, మహాశయా. టైటిలు ఆ విధంగా మార్చావంటే నీ పుస్తకాలు కొత్తగా రిలీజయిన సినిమా టిక్కెట్లలా అమ్ముడుపోతాయి. అసలు డబ్బు సంపాదించాలంటే మోసం చేయాలి కదా."

"నిజమే, నీలవేణీ. అలాగే చేస్తా. కాని టైటిలు మార్చాలంటే మళ్ళీ ఎంత ఖర్చవుతుందో" ఆలోచనలో పడిపోయాడు సప్తగిరి.

తరవాత ప్రేమ కబుర్లతో కొంత సమయం గడిపారు ఇద్దరూ.

"మా అమ్మ పిలుస్తూంది. నే వెడతా" అంటూ కదిలిన నీలవేణి జడ పట్టుకుని కిటికీ దగ్గరకు లాగాడు. ఆమె తన బుగ్గమీద ముద్దు పెట్టుకోవడం కోసం జాంబవంతుని మూతిలా పొడవుగా సాగి వస్తున్న అతని మూతిని ఒక చేత్తో లోపలికి నెట్టి, జడ విదిలించుకుని బయటికి నడిచింది 'అన్నర్ మారేజి' అంటూ.

దాంతో నిరాశగా తలుపు తీశాడు సప్తగిరి.

"సారీ, బ్రదర్. నిన్ను బాధ పెట్టినట్లున్నాను. బోరు కొట్టింది కదూ?"

"బోరేం లేదు. ఇంటికి వెళ్ళి భోజనం చేసి వచ్చి ఇప్పుడే కూర్చున్నాను."

"ఆఁ!" అని ఆశ్చర్యంగా నోరు తెరిచి, "సరే, రా లోపలికి" అన్నాడు.

సప్తగిరి కుర్చీలో కూర్చుని టేబులు మీద కాళ్ళు పెట్టుకున్నాడు. గోవిందరావు ఈజీఛెయిర్‌లో కూర్చున్నాడు.

"అయితే ఏం చేయ మంటావు, గురూ?"

సప్తగిరి తలను ఒకసారి తడుముకొని "ఎలా ఉంది నా తల" అన్నాడు.

టెన్నిస్ కోర్టుకు ఆ అంచూ, ఈ అంచున పెరిగిన పచ్చి గడ్డిలా సప్తగిరి నడినెత్తి వెంట్రుక లూడిపోయి నున్నగా మెరుస్తూంటే, చెంపల మీద మాత్రం వెంట్రుక లున్నాయి. గోవిందరావు సప్తగిరి తలను చాలా రోజుల నుంచి చూస్తూనే ఉన్నాడు. కాని 'గురూగారూ, ముప్పై ఏళ్ళకే మీ తల టెన్నిస్ కోర్టులా ఎందుకయింది.?' అని అడగలేక మధన పడుతున్నాడు. ఇప్పుడు తన సమస్య తీరే సమయ మొచ్చిందని సంబరపడ్డాడు.

"మీ తలకేమండీ ఎంతో బ్యూటిఫుల్‌గా ఉంది."

"ఏం? నీకు ఫన్నీగా ఉందీ"

"అయ్యయ్యో! ఫన్నీగాదండీ. గురువుగారూ, మీరు ఎలా ఉందని అడిగితే సమాధానం చెప్పాను." నొచ్చుకొంటూ అన్నాడు గోవిందరావు.

"ఏం చెప్పేదయ్యా గోవిందరావు నా పరిస్థితి. ఉద్యోగంలో చేరిన క్రొత్తలో నా తలవెంట్రుకలు కర్లింగ్సుతో ఎంతో దట్టంగా ఉండేవి. తరవాత ఇదిగో ఈ పుస్తకం వ్రాశానయ్యా. దాంతో నెత్తిమీద వెంట్రుక లూడడం మొదలయింది. పుస్తకం వ్రాయడం పూర్తి కావడం, వెంట్రుక లన్నీ వూడిపోవడం ఒకేసారి జరిగింది. రచయితల కిదొక శాపమయ్యా బాబూ. పేరుగాంచిన రచయితల్ని వెతుకు. వాళ్ళలో నూటికి తొంభై మందికి బాల్డ్ హెడ్డే."

కొమ్ములు తిరిగిన రచయితలతో సప్తగిరి తనను పోల్చుకున్నందుకు రాబోయిన నవ్వు ఆపుకొన్నాడు గోవిందరావు. "చిత్రం. సెలవియ్యండి" అన్నాడు.

"నా బాధంతా ఒకటేనయ్యా. పుస్తకాలు ఈ రోజు కాకపోతే రేపు అమ్ముడవుతాయి, కొంత పర్సెంటు రిడక్షనిస్తే. కాని వూడిపోయిన వెంట్రుకలు ఎలా తిరిగి వస్తాయయ్యా?"

సప్తగిరి బాధను చూసి గోవిందరావుకు అతని మీద జాలి కలిగింది.

"బాధపడకండి. మీ బాల్డ్ హెడ్డు ఏమాత్రమూ అసహ్యంగా లేదు. మీకు రచయితగా అదొక గుర్తింపు కూడాను."

"ఏం గుర్తింపు. గోవిందరావ్? బంగారంలాంటి పర్సనాలిటీ పోయింతర్వాత. నా ప్రేమ కూడా ఈ బాల్డ్‌హెడ్ కారణంగానే ఫెయిలయ్యేటట్లుంది. ఈ మానసిక క్షోభ ఎలా భరించేది?"

"ఏం బాధపడకండి. మంచి డాక్టర్ని కన్సల్టు చేద్దాం."

"ఒక డాక్టరేం ఖర్మ. ఇప్పటికి ఎంతో మంది డాక్టర్లు అయిపోయారు. కాని నా జబ్బు నయం కాలేదు."

"మీరు ఆయుర్వేద డాక్టర్లను కూడా కన్సల్టు చేశారా?"

"ఆఁ! వాళ్ళుమాత్రం ఏం చేస్తారు? హోదాల్సు

మాటలు చెప్పడం తప్పు."

"అలా అనుకోవడం మంచిది కాదు గురువు గారూ. నే చెప్పే ఈయన ఇటువంటి విషయాల్లో ఆరితేరిన వాడు. మీ జబ్బుకు సరైన వైద్యం చేస్తాడు." సప్తగిరికి ధైర్యం చెప్పాడు.

• • • •

"నీలవేణీ! నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?" నీలవేణి కోమలమైన చేతిని తన చేతితో నిమురుతూ ప్రేమగా అడిగాడు.

"ఎందుకు ఇన్నిసార్లు అడుగుతున్నావు? మనం ప్రేమించుకొన్నది నిజం. మన పెళ్ళి కాబోయేది తథ్యం."

"అదే నువ్వు ప్రేమిస్తున్నట్లు సరదాకి చెబుతున్నావా లేక నిజంగానా? నా పర్సనాలిటీ చూసి చెప్పు."

"నీ పర్సనాలిటీకేం. నా కలల్లో రాకుమారుడివి."

"నా బాల్డ్‌హెడ్ చూశావు గదా. ఇది తెలిసే మాట్లాడుతున్నావా?"

"బాల్డ్‌హెడ్ ఉంటే ఏం? ఫారిన్‌లో ఎక్కువ మంది ఆడపిల్లలు బాల్డ్‌హెడ్‌ను చూసి ప్రేమలో పడుతారట. అదొక డిగ్నిటీగా ఫీలవుతారట. నేను నీలో నచ్చి ఆకర్షింపబడ్డ అంశం అదేనేమోనని నా అనుమానం."

"నో. నెవర్. నీవు నా అందం చూసిగాదు ప్రేమించింది."

"మరి?"

"నా ఉద్యోగం చూసి."

"ఈ రోజు నా కేదో అగ్ని పరీక్ష పెడుతున్నట్లున్నావు. ప్రేమ అనేది పరస్పర ఆకర్షణ వల్ల ఏర్పడుతుంది. ఐశ్వర్యానికి, అందానికి అది అతీతం. ఇక ఉద్యోగం అనేది ప్రేమ గట్టి పడడానికి దోహదం చేస్తుంది. ఉద్యోగం లేకపోయినా ప్రేమించి పెళ్ళి చేసుకొన్న జంటలు ఎన్ని లేవు."

"రేపు పెళ్ళయిం తర్వాత నా బాల్డ్‌హెడ్‌ను అసహ్యించుకొంటూ నన్ను చిన్నచూపు చూస్తావు కదూ!"

"ఛ ... నే నెందుకు అలా చేస్తాను. అలాంటివేం మనసులో పెట్టుకోకు. ప్రేమికులు అన్న తరవాత పరస్పరం గౌరవించుకోవాలి."

"నో. నేను నమ్మను. ప్రతి ఆడదీ భర్త అవక తవకల్ని వేలెత్తి చూపి బాధపెడుతుంది."

నీలవేణి సప్తగిరివైపు కోపంగా చూసింది. తర వాత చరచరా వెళ్ళిపోయింది.

ఇంతలో బయట తలుపు మీద చప్పుడయింది.

తలుపు తీయగానే లోపలికి వచ్చాడు గోవిందరావు. "అంతా రెడీయేనా?" అన్నాడు.

"రెడీ. వెళ్దాం పద."

వీళ్ళు వెళ్ళేసరికి ఆయుర్వేద భిషక్‌గారు ఇంట్లోనే ఉన్నారు. చాప మీద కూర్చొని, ముందున్న చిన్న టేబిలు మీద ఏదో వ్రాసుకొంటున్నాడు. అతని కెదురుగా రోగులు కూడా చాపల మీద కూర్చొని ఉన్నారు. కొద్ది దూరంలో కల్వంలో ఏవేవో ఆకులు, వేర్లు, మూలికలు నూరుతూ ఇద్దరున్నారు



ఫోటో: ఎల్. ఆర్. గ్రోవర్

కొద్ది దూరంలో మందు సీసాలకు పట్టీస్తూ మరొక ఇద్దరున్నారు.

భిషక్‌గారి ఆహ్వానం మీద సప్తగిరి, గోవింద రావు, చాపమీద కూర్చొన్నారు. ఆయన ఒక్కొక్కరిని వ్యాధి గురించి అడుగుతూ దానికి సంబంధించిన మందు పొడులు, భస్మాలు, మాత్రలు కట్టి ఇస్తున్నాడు. సప్తగిరి తనవంతు రాగానే అంతా వివరించి చెప్పాడు.

ఆయుర్వేద వైద్యులుగారు మొదట కొంత స్పీచిచ్చారు. "అయ్యా, భారతదేశంలో అనాదిగా వాడుకలో ఉన్న వైద్యము, తిరుగులేని వైద్యము ఆయుర్వేదమై యున్నది. 'ఆయుః' అనగా లైఫ్ అని, 'వేదము' అనగా నాలెడ్జి అని ఇంగ్లీషు అర్థం. అంటే సుఖజీవనము గడుపుటకు సరియైన జ్ఞానం అని భావం. కనుక ఆయుర్వేదం అన్ని వైద్యముల లోకి ఉత్కృష్టమైనదని పెద్దలు చెప్పుచున్నారు.

అయ్యా, మీరు చెప్పే వెంట్రుకలు వూడేను జబ్బు ఆయుర్వేదంలో 'ఖాలిత్య' అని అంటారు. దీనికి ఆయుర్వేదంలో అద్భుతమైన మందున్నది. నేనొక భస్మం ఇస్తాను. ప్రస్తుతానికి వాడండి. నిద్ర లేవగానే ముఖం కడుక్కొని తులం భస్మాన్ని తేనెలో కలుపుకొని ఆరగించండి. తరవాత నే నిచ్చిన తైలాన్ని తలమీద మర్దన చేయండి. అలా చేయడం వలన మొదట్లో బలహీనమైన వెంట్రుకలన్నీ వూడి పోతాయి. అయినా భయపడకండి. అలా వాడుతూ ఉంటే ఫలితం కనిపిస్తుంది.

నాయనా! నీవు అనుమానించాల్సిన అవసరం లేదు. దీనికి తగ్గకుంటే మహత్తరమైన మందు మరొకటుంది. ఒక నాలుగు వందలు ఇచ్చిపోండి. ఏనుగు దంతాలను పుటం పెట్టి చూర్ణం చేయించి ఇస్తాను. దాన్ని తేనెలో కాని, నేతిలో కాని రంగరించి బట్టతలమీద మర్దన చేశారంటే దానికి తిరుగు ఉండదు. అయితే అది వాడబోయే ముందు నున్నగా గుండు చేయించుకోవాలి."

సప్తగిరికి కళ్ళు తిరిగాయి. నాలుగొందలు అంటున్నాడు. ఇంత ఖరీదా? చేసిన అప్పులు ఇప్పటికీ తీర్చలేకున్నాడు. అదీగాక వెంట్రుకలు తీయించేస్తే మరలా వస్తాయో, రావో! ఉన్నవి పోగొట్టుకోవడం అంత అవివేకం మరొకటి లేదు. ఆ పర్సనాలిటీతో నీలవేణికి ముఖం చూపించలేడు.

సప్తగిరి గోవిందరావు తొడ గిల్లాడు— "ఇక వెళదాం" అంటూ.

"తరవాత వచ్చి నాలుగు వందలు ఇస్తాం కాని, ఇంతకు ముందు చెప్పిన భస్మము, తైలము ఇవ్వండి చాలు."

ఆయుర్వేద భిషక్ తన ఫీజుతో కలిపి మొత్తం పదిహేను రూపాయలు బిల్లు చెప్పాడు. బిల్లు చెల్లించి బయట పడ్డా రిద్దరూ.

"గురువుగారు ఏదో అనుమానిస్తున్నట్టున్నారు." దారిలో అడిగాడు గోవిందరావు.

"అవునోయ్. నా కీ వైద్యం ఇష్టం లేదు.."

నడుస్తున్న గోవిందరావు ఠక్కున ఆగిపోయాడు. "గురువుగారూ! మీరు అదృష్టవంతులు. మీకు పర్మనెంటు క్యూర్ దొరికింది."

"నిజం!" ఆశ్చర్యంగా అడిగాడు సప్తగిరి.

"పర్ఫెక్ట్లీ. పక్క వీధిలో ఖాసింఖాన్ అని నా మిత్రు డొక డున్నాడు. వాడికి గొర్రెతోక బెత్తెడు అన్నట్లు తల వెనక నాలుగే నాలుగు వెంట్రుక లున్నాయి. వాటిని ఆరేళ్ళ నుంచి ప్రాణంగా కాపాడు కుంటూ వస్తున్నాడు. నా దిమధ్య నా కో విషయం చెప్పాడు."

"ఏమిటది?"

"ఢిల్లీలో హేర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్ ఒకటుందని. అక్కడకు వెళ్ళి తలమీద వెంట్రుకలు నాటించుకుని వస్తాడని."

"అలా జరుగుతుందంటావా?"

"ఈ అణుయుగంలో సాధ్యం కానిది ఏమీ లేదు, గురూ."

"అయితే ఆలస్యం దేనికి? వెళదాం పద."

ఇద్దరూ ఖాసింఖాన్ ఇంటికి వెళ్ళారు. గోవింద రావు కాలింగ్ బెల్ నొక్కాడు.

"ఎవరూ?" నోరగా తలుపు తెరిచి అడిగిం దో ఆకారం.

"నే నమ్మా. జి. గోవిందరావుని. అంటే గోడ కింద గోవిందరావుని. ఈయన మా గురువుగారు."

ఒక నిమిషం తరవాత "మీకు మాత్రమే అనుమతి లభించింది. మీ గురువుగారిని అక్కడే కూర్చో పెట్టండి" అని తిరిగి అదే ఆకారం చెప్పింది.

"పరవాలేదు లేమ్మా. ఖాన్ ఏం అనుకోడులే" అంటూ చనువుగా సప్తగిరిని లోపలికి తీసుకుని వెళ్ళాడు గోవిందరావు. అక్కడ ఖాన్ లుంగీతో కుర్చీలో కూర్చుని ఉన్నాడు. అతని నున్నని తలమీద ఎర్ర సిరాతో చదరపు గళ్ళు గీసి ఉన్నాయి. చూడ్డానికి అత నో వింత జంతువులా ఉన్నాడు. వెనక గొర్రె

తోకలా వెళ్ళాడు బొట్టుంది.

"ఏమిట్రా ఏమిటీ విషయం?"

"అవన్నీ తరవాత చెబుతాను కాని, ముందు గెస్టును పరిచయం చెయ్యి" అన్నాడు గళ్ళు కనపడకుండా తలకు చేతు అడ్డు పెట్టుకుంటూ.

"వీరు సప్తగిరిగారని మా ఆఫీసే— ఈయనా బాల్డ్ హెడ్‌తో బాధ పడుతున్నాడు. హేర్ ట్రాన్స్‌ప్లాంటేషను గురించి తెలుసుకోవాలని వచ్చాడు."

"ప్లీజ్డ్ టు మీట్ యు, మై డియర్ సప్తగిరిగారూ. హేర్ ట్రాన్స్‌ప్లాంటేషను గురించి అడిగారు కనక చెబుతున్నాను. దీని ఆఫీసు ఢిల్లీలో ఉందండి. తలమీద ఎక్కడైనా కొంతమేర వెంట్రుకలుంటే చాలు. దాన్ని తీసి మిగతా తల మీద నాటుతారు. ఇక చూసుకోండి నా సామిరంగా! వెంట్రుకలు విచ్చలవిడిగా పెరుగుతాయి. పని గంటా, రెండు గంటల్లో అయిపోతుంది."

"ఎంత అవుతుందంటారు సుమారు?"

"ఒక చదరపు అంగుళం నాటడానికి నాలుగు వందలు అవుతుందండి. ఆ లెఖ్ఖన బట్టతల ఎంత వైశాల్య ముంటే అంత. అందుకే నా తల మీద చదరపు గళ్ళు గీయించుకున్నాను. ఇవి పదిహేను ఉన్నాయి. అంటే ఆ లెఖ్ఖన ఆరు వేలు అవుతుంది."

"వో మై గాడ్!"

సప్తగిరి ఆ తరవాతి క్షణంలో మరి అక్కడ లేడు.

• • •

సప్తగిరికి రోజులు భారంగా గడుస్తున్నాయి. రోజు రోజుకీ కృశించి పోతున్నాడు. అతను కృశించే కొలదీ వెంట్రుకలు వూడడంకూడా ఎక్కువగా అయింది. నీలవేణి, గోవిందరావుల వోదార్పు మాటలే లేకపోతే అత నేమయిపోయే వాడో!


ఆ రోజు సప్తగిరి ఆఫీసు పనిమీద రాజధాని నగరానికి పోవాల్సి వచ్చింది.

సప్తగిరి హైదరాబాదు ఎలాగూ పోతున్నాడు కనక, గోవిందరావు ఏయే డాక్టర్లను కన్సల్టు చేయాల్సిందీ చెప్పాడు. సప్తగిరి హైదరాబాదు చేరుకుని తను తెచ్చిన రికార్డ్సు హెడ్ ఆఫీసులో ఇచ్చాడు. దానిమీద వచ్చే ఉత్తర్వులు తనే స్వయంగా పట్టుకెళతానని, అప్పటివరకు ఇక్కడే ఉంటానని వాళ్ళతో చెప్పాడు.

బాల్డ్ నెస్ కంటూ ఒక స్పెషలిస్టు రాజధానీ నగరంలో లేకపోవడంతో గోవిందరావు చెప్పిన పెద్ద డాక్టరును కలుసుకో దలిచాడు. రెండో రోజు అపాయింట్‌మెంటు వచ్చింది. డాక్టరును కలుసుకున్నాడు సప్తగిరి. డాక్టరుని చూడగానే సప్తగిరికి నమ్మకం కలిగింది. కారణం డాక్టరు తలంతా నిండుగా వెంట్రుక లున్నాయి.

సప్తగిరిని అన్ని పరీక్షలు చేసిన డాక్టరు చివరకు ఏ జబ్బూ లేదని నిర్ణయించాడు.

"సార్. ఎన్నో ఆశలు పెట్టుకు వచ్చిన నన్ను ఇంత నిరాశతో వెనుదిరిగి పంపడం న్యాయమా" అన్నాడు చివరకు. తను ఎలా వ్యథ చెందుతున్నాడో కన్నీటి గాథగా వివరించాడు.



ఫోటో: యం. నగేష్

డాక్టరు చిరునవ్వు నవ్వాడు. తన నుదుటిని గోటితో గీచి తలమీద విగ్గును తీసి టేబులు మీద పెట్టాడు. తల నున్నగా, గుండ్రంగా గ్లోబులా ఉంది. రాష్ట్రంలో ప్రఖ్యాతి వహించిన డాక్టరు, మొన్ననే వైద్య వృత్తిలో ఉత్తమ డాక్టరుగా కేంద్ర ప్రభుత్వ అవార్డు తీసుకున్న వ్యక్తికీ బాల్డ్ హెడ్డే. సప్తగిరి కళ్ళప్పగించి చూస్తున్నాడు.

డాక్టరు నవ్వి, "సంఘంలో నా విలువ తగ్గి పోతుందని ఇది పెట్టుకో లేదు. నే నెప్పుడూ హాస్పిటలుకు విగ్గు లేకుండా వస్తాను. నిన్న మా వాళ్ళు మీకు అపాయింటుమెంటు ఇచ్చిన తరవాత నా పరిస్థితి మీకు ఉదాహరణగా చూపాలని విగ్గు పెట్టుకొచ్చాను.

బాల్డ్‌నెస్ అనేది జబ్బు కాదు. తల మీద చర్మం కింద కణజాలము వీక్‌గా ఉంటే వెంట్రుకలు త్వరగా వూడుతాయి. దీనిని గురించి ఎక్కువగా ఆలోచిస్తే అనవసరమైన మానసిక శ్రమ, ఆత్రత తప్పవు. దీనివల్ల శారీరకంగా బాధ లేకపోయినా, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో మనిషి కుంగిపోతాడు. తన అందం తరుక్కు పోయిందని బాధ పడతాడు. నిజానికి ప్రతి మనిషి ఉన్నతమైన తన నడవడికతో పది మందికి ఆదర్శవంతుడు కావాలి. అంతేకాని తుచ్ఛమైన బాహ్య సౌందర్యానికి విలువ ఇవ్వ కూడదు.

అసలైన గాంధి మహాత్ముడ్ని మన కళ్ళ ముందు నిలబెట్టిన 'ఆటెన్‌బరో' 'గాంధీ' సినిమా చూశారా? ఆయనకు ఎంత బట్టతల! దానివల్ల సంఘంలో ఆయనకు విలువ పోయిందా? భారత జాతి పిత అని దేశదేశాల్లో ఎలా కొనియాడబడుతున్నాడో మనకు తెలిసిందే కదా. వై డు యు ఫీల్ బాల్డ్ నెస్ యాజ్ ఎ షేమ్‌ఫుల్ థింగ్. వై నాట్ యు ఫీల్ ఇట్ యాజ్ ఎ సింబల్ ఆఫ్ నాలెడ్జి" అంటూ సప్తగిరి మనస్తాపాన్ని పోగొట్టాడు డాక్టరు.

"మీరు బట్టతల గురించి ఆలోచన మాని నేను చెప్పినట్లు ఆహారంలో మార్పులు చెయ్యండి."

"అలాగే సార్" అంటూ బుద్ధిమంతుడిలా తల వూపాడు సప్తగిరి.

"మీరు నాన్ వెజిటేరియన్ అయితే మాంసం, చేపలు ఎక్కువగా తినండి. వెజిటేరియన్ అయితే పెరుగు, పాలు, నెయ్యి మీ ఆహారంతోపాటు విరివిగా తీసుకోండి. వెంట్రుకలు రాలిపోవడం చాలా వరకు అరికట్టబడుతుంది" అంటూ వివరించి చెప్పి కొన్ని విటమిను టాబ్లెట్లుకూడా వ్రాసిచ్చాడు డాక్టరు.

• • • •

సప్తగిరి డాక్టరు సాంత్వన వచనాలకు కొంత తెప్పరిల్లిన వాడై డైరెక్టరు ఆఫీసుకు వెళ్ళి తన పనికి సంబంధించిన ప్రొసీడింగ్సు పట్టుకుని తిరిగి భువనగిరికి వచ్చాడు.

ఇంటి లోగిలిలో అడుగు పెట్టగానే మొట్ట మొదట చూడాలనుకున్నది నీలవేణిని. అదృష్ట వశాత్తూ నీలవేణి పంపు దగ్గర నీళ్ళు పడుతూ ఉంది. 'నీలవేణి' అంటూ ఆనందంగా పిలిచాడు. నీలవేణి తలెత్తి ఇతని వైపొకసారి విసుగ్గా చూసి పంపు కట్టి విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

సప్తగిరి తల తిరిగి పోయింది. తన ఆరాధ్యదేవత నీలవేణి ప్రవర్తన అతనికి అర్థం కాలేదు. గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని కొద్ది సేపు పడుకున్నాడు. ఆ రోజంతా ఆమె కనపడలేదు. ఆ రోజే కాక క్రమేణా ఆమె అతనికి దూరం కాజొచ్చింది. సప్తగిరి ఈ వేదన భరించలేక పోయాడు. ఎన్ని రాయబారాలు పంపినా నీలవేణి ఇతనికి ముఖం చూపించ లేదు.

సప్తగిరి జ్వరాన పడ్డాడు. పక్కింటి వృద్ధురాలు మానవత్వంతో అతనికి సేవ చేస్తూ ఉంది. ఒక రోజు స్నేహితుడు గోవిందరావుతో, 'తను నీలవేణి లేకపోతే చచ్చి పోతానని, ఎలాగయినా తామిద్దరినీ కలపా'లని గోడు పెట్టాడు.

చెప్పిన గంటకు తిరిగి వచ్చాడు గోవిందరావు.

"ఏమంటున్నది నా దేవత?" ఆత్రతగా చేతులు పట్టుకుని అడిగాడు.

"కూర్చోండి, గురువుగారూ. అసలు తప్పంతా మీదే."

"నాదా! ఇదేం అన్యాయం" వాపోయాడు సప్తగిరి.

"ఆమె చెప్పిన మాటలు చెబుతాను విను. నువ్వు బాహ్య ఆడంబరాలకు పోతావుట. ఈ రోజు బట్టతల అని నిన్ను నీవే అసహ్యించుకునే వాడివి, రేపు వివాహం అయిన తరవాత అదే న్యూనత కారణంగా తనలో అందం తగ్గిపోగానే ఎవరేమనుకుంటారేమోనని తరిమేస్తావుట. అదీ ఆమె భయం. అందు అటు నీ ప్రేమనూ వదలుకోలేక ఇటు తన జీవితం నాశనం చేసుకోలేక నిన్ను ప్రేమించిన ఖర్మానికి కుమిలిపోతూ ఉంది."

"అయామ్ వెరీ సారీ గోవిందరావ్. నే నిక ఒక్క నాటికీ అలా చేయను. ఆమె ముందు ప్రమాణం చేసి చెబుతాను. ఒక్కసారి ఆమెను తీసుకురా."

"నేను తీసుకు రావడ మేమిటి? ఆమె రోజూ వచ్చి ఆ వైపు కిటికీలోంచి చూస్తూంటుంది. అదిగో చూడు" అన్నాడు గోవిందరావు.

అప్పటివరకు కారే కన్నీటిని తుడుచుకుంటున్న నీలవేణి వెళ్ళబోయింది. చప్పున వెళ్ళి చేయి పట్టుకున్నాడు సప్తగిరి. ఇద్దరి కళ్ళలో కన్నీరే.

మరుసటి నెలలో ఇద్దరికీ వివాహంజరిగిపోయింది.

అద్దంలో ముఖం చూసుకున్నప్పుడు 'రచయితల కిదొక శాపం' అని తల తడుముకుని నాలుక కొరుక్కుంటుంటాడు ఇప్పటికీ సప్తగిరి.

సంసారం పెరిగి బాధ్యతలు ఎక్కువయితేనే కాని ఆ ఆలోచన పోదేమో? ●